



# నవభూమి

## నల్లగొండ అనుబంధం

31 అక్టోబర్,2024 గురువారం పేజీలు:5

www.epaper.navabhoomi.in


# సంక్షేమమే ప్రధాన ధ్యేయం



కలెక్టర్ ఎం.హనుమంతరావు

**యాదాద్రి-నవభూమి:** పభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను పకడ్బందీగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఎం.హనుమంత్‌రావు తెలిపారు. కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా మంగళవారం ఆయన పలు విషయాలు వెల్లడించారు. ఆయన మాటల్లోనే..జిల్లాను అన్ని రంగాల్లోనూ అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లేందుకు జిల్లా యంత్రాంగం ఛాలెంజ్ గా పనిచేస్తోంది. జిల్లాలోని ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందేలా చూస్తాం.ప్రభుత్వం ప్రజల అభ్యున్నతిని దృష్టిలో పెట్టుకుని, పలు సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతుంది, ఈ సంక్షే మ ఫలాలు ప్రజలకు చేరువయ్యేలా చూస్తాం. ప్రజలనుంచి వచ్చే ప్రతీ అర్జీని కూడా పరిశీలిం చి, క్షేత్రస్థాయిలో ఆ సమస్యలు వెంటనే పరిష్కరి స్తాం. జిల్లాలోని ప్రజలందరికీ మౌలిక వసతులు, ఆరోగ్యం, విద్యనందించేందుకు అన్నిశాఖలు సమన్వయంతో ఉండేలా తగిన చర్యలు తీసుకుంటాం. జిల్లావ్యాప్తంగా ప్రజలకు మౌలిక వసతులు కల్పనపై సంబంధిత శాఖలతో సమీక్షించి, ప్రభుత్వం రూపొందించిన ప్రణాళిక ప్రకారం పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ ప్రాధాన్యతగల సంక్షేమ పథకాలపై ప్రత్యేక శ్రద్ధ వహించి, పక్కాగా అమలు అయ్యేలా చేస్తాం.పథకాల అమలు తీరుపై తనిఖీలు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకా లు అమలు తీరుపై క్షేత్రస్థాయిలోకి వెళ్లి ముమ్మరంగా తనిఖీలు చేపట్టనున్నాం. ప్రభుత్వం త్వరలోనే ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద నియోజకవర్గానికి 3500 నుంచి 4వేల ఇళ్లను మంజూరు చేయనుంది. వీటన్నింటిని అర్హులకు అందేలా కృషి చేస్తాం. జిల్లాలోని ప్రజాప్రతినిధుల సహకారంతో సంక్షేమ, అభివృద్ధి పథకాలను అర్హులైకు అందేలా చూస్తాం. జిల్లాలో సాగునీటి రిజర్వాయర్లు, కాల్వల పునరుద్ధరణ, మూసీ నది పునరుజ్జీవం వంటి అంశాలపై అధ్యయనం చేస్తాం. ప్రభుత్వం ప్రాధాన్యక్రమంలో నిధులు కేటాయిస్తుంది. ఆ మేరకు పనులు పూర్తయ్యేలా తగిన కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేస్తాం.సర్వేకు సన్నద్ధం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే (సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులసర్వే)కు జిల్లాయంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. ఈసర్వేలో ప్రజలకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరిస్తాం. సర్వే నిర్వహణకు అవసరమైన ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్ల గుర్తించి, వారికి శిక్షణ అందిస్తున్నాం. గ్రామ, మండల, జిల్లాస్థాయి ప్రభుత్వ అధికారులను ఎంపిక చేయనున్నాం.ధాన్యం కొనుగోళ్లపై ప్రత్యేకశ్రద్ధ రైతులు పండించిన ధాన్యాన్ని మద్దత .ధరకు కొనుగోలు చేసేందుకు ఏర్పాటుచేసిన కేంద్రాల్లోనే విక్రయించాలి. ధాన్యం కొనుగోళ్లపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటాం. జిల్లాలో ఇప్పటికే చాలా వరకు సేకరణ కేంద్రాలు ప్రారంభమయ్యాయి. మిగతా వాటిని కూడా ధాన్యం రాకను బట్టి ఏర్పాటు చేస్తాం. రైతులు ధాన్యం అరబెట్టి, 17శాతం తేమతో కేంద్రాల్లో విక్రయించాలి. జిల్లావ్యాప్తంగా దాదాపు 4లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేస్తామన్నారు.

## ప్రతిష్టాత్మకంగా చేపట్టాలి



### పకడ్బందీగా కుటుంబ

# సర్వే చేపట్టాలి




**భువనగిరి -నవభూమి:** తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుం బ సర్వేను విజయవంతంగా నిర్వహించాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఇంటిం టి కుటుంబ సర్వేపై మంగళవారం ఆయన మధిర తహసీల్దార్ కార్యాలయం నుంచి సీఎస్ శాంతికుమారి, ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహణ విధి విధానాలను కేబినెట్ సమావేశాల్లో చర్చించి ఆమోదించామని, ప్రజల సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, కుల వివరాలను సర్వే ద్వారా సేకరిస్తామని అన్నారు. అందుకు అవసరమైన ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లను గుర్తించి అవసరమైన శిక్షణ ఇచ్చి గ్రామం, మండలం, జిల్లాస్థాయి ప్రభుత్వాధికారులను ఎంపిక చేయాలని సూచించారు. సీఆర్‌పీ, గెస్ట్ టీచర్ల సేవలు వినియోగించుకోవచ్చునని సూచించారు. 150 కుటుంబాలకు ఒక ఎన్యూమరేటర్ ఉండేలా చూడాలని చెప్పారు. సర్వే నిర్వహణకు ప్రతీ మండలానికి ఒక జిల్లా స్థాయి అధికారిని నోడల్ అధికారిగా నియమించాలన్నారు. సర్వే షెడ్యూల్ వివరాలు ప్రజలకు చేరేలా ప్రచారం నిర్వహించి, వచ్చే నెల 6వ తేదీ నుంచి సర్వే ప్రారంభించాలన్నారు. కాన్ఫరెన్స్‌లో మంత్రులు పొన్నం ప్రభాకర్, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, సీఎస్ శాంతికుమారి, తదితరులు పాల్గొన్నారు.అధికారులు బాధ్యతాయుతంగా పని చేయాలి బలహీన వర్గాలు, అట్టడుగు పేద ప్రజలందరికీ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందేలా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని కలెక్టర్ ఎం.హనుమంతరావు అన్నారు. కలెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆయన మంగళవారం వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి జిల్లాను అభివృద్ధి పథంలో అగ్రగామిగా నిలపాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు గంగాధర్, జి.వీరారెడ్డి, జడ్పీ సీఈవో ఎన్.శోభారాణి, ఆర్డీవోలు కృష్ణారెడ్డి, శేఖర్‌రెడ్డి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి టి.నాగిరెడ్డి, ఎల్.యశోద, డీఎఫవో పద్మజరాణి, జిల్లా రవాణా అధికారి సాయికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం



**భూదాన్ పోచంపల్లి నవభూమి ప్రతినిధి అక్టోబర్ 30** మృతుడి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందిస్తున్న గీత కార్మిక సంఘం అధ్యక్షులు గునిగంటి మల్లేష్ గౌడ్ భూదాన్ పోచంపల్లి పురపాలక కేంద్రంలో సీతావాణి గూడెంచెందిన కల్లుగీత కార్మిక సహకార సంఘ సభ్యుడు తంతరపల్లి నరసింహ గౌడ్ ఇటీవల మృతిచెందగా బుధవారం సంఘ అధ్యక్షులు గునిగంటి మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో వారి కుటుంబాన్ని పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం కుటుంబ సభ్యులకు సంఘం నుండి 5000 రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో వీరితోపాటు మాజీ అధ్యక్షులు చెరుకు అంజయ్య ,బండి యాదగిరి గౌడ్, జిల్లా గౌడ సంఘం నాయకులు కొయ్యడ నరసింహ గౌడ్, నాయకులు గడ్డం బాలరాజ్ గౌడ్, చెరుకు మల్లేష్ గౌడ్, సంఘము ఉపాధ్యక్షులు తండవెంకటేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శిమక్తాల పోచయ్య గౌడ్, సభ్యులు కట్కూరి సత్యనారాయణ గౌడ్, తంతారపల్లి బసవయ్య గౌడ్, మునుకుంట్ల కిష్టయ్య గౌడ్, వెంకటేష్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్ తదితరులు ఉన్నారు.

## సమగ్ర కులగణన పకడ్బందీగా చేయాలి

### తహసీల్దార్ హరిబాబు, కమిషనర్ యూసుఫ్

**మిర్యాలగూడ నవభూమి, అక్టోబర్ 30:–** కులాల సామాజిక, ఆర్థిక తదితర స్థితిగతులపై సమగ్ర కుల గణనను పకడ్బందీగా, సమర్థవంతంగా చేయాలని మిర్యాలగూడ తహసీల్దార్ ఎన్.హరిబాబు, మున్సిపల్ కమిషనర్ ఎండీ. యూసఫ్ లు కోరారు. బుధవారం స్థానిక మున్సిపల్ మీటింగ్ హాలులో జరిగిన కుల గణన ఎన్యుమెరేటర్స్ శిక్షణ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఈ నెల 6నుండి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనున్న సమగ్ర కుల గణనలో తప్పులు లేకుండా జాగ్రత్తగా నిర్వహించాలని వారు కోరారు. ప్రతి ఇంటికి, అద్దెకున్న వారి, అపార్ట్మెంట్ లో, గెటెడ్ కమ్యూనిటీలలో తిరిగి వివరాలు నమోదు చేయాలని వారు కోరారు. మిర్యాలగూడ పట్టణంలో సుమారు 25,000 ఇళ్లున్నాయని 290 మంది ఎన్యుమరేటర్లను నియమించామని ప్రతి ఎనేమెరేటర్ 150 ఇళ్లు సర్వే చేయాలని కమిషనర్ కోరారు. 9 రోజుల గణన చేసిన వారికి 10,000 రూపాయలు రెమ్యునరేషన్ ఇస్తామని ఆయన తెలిపారు. సమావేశంలో స్పెషల్ ఆఫీసర్, ఎడిఎ బి. దేవ్ సింగ్, టీపిఓ సోమయ్య, శానిటరీ ఇన్స్పెక్టర్ వెంకటరమణ, ఎంఈఓ ఎల్. బాలునాయక్, టీపిఎస్ అంజయ్య, టీఎంసి బక్కయ్య, ట్రైనర్లు జి.జ్ఞానేశ్వరీ, జాఫర్ అలీ, సాంబయ్య, దయాకర్ రెడ్డి, శహ్బాజ్ హుస్సేన్, హనుమాన్ ప్రసాద్, కల్పనలు పాల్గొన్నారు





## సమగ్ర కులగణన అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టాలి

◆ మేమెంతో మాకంత వాటా దక్కాల్సిందే

◆ బీసీ నేత లింగంగౌడ్



**మిర్యాలగూడ నవభూమి, అక్టోబర్ 30:–**సమగ్ర కులగణన అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ పేర్కొన్నారు. నవంబర్ 6నుంచి కులగణన సర్వే ప్రారంభమవుతున్న సందర్భంగా పట్టణంలోని ఎన్ఎస్పి గెస్ట్ హౌస్ లో కుల సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథి లింగంగౌడ్ మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చిన తర్వాత తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న మొదటి కులగణన సర్వే గనుక సర్వేను బీసీ కమిషన్ అత్యంత ప్రతిష్టాత్మకంగా శాస్త్రీయంగా, హేతుబద్ధంగా నిర్వహించి ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలబడాలన్నారు. సమగ్ర కులగణనపై రాష్ట్రవ్యాప్తంగా విస్తృత ప్రచారం కల్పించాలని మీడియా ద్వారా ప్రతి పల్లెకు, ప్రతి గూడెంకు ప్రతి బస్తికి చేరుకునేలా విస్తృత ప్రచారం నిర్వహించడానికి కమిషన్ ప్రణాళిక రూపొందించాలని వారు కోరారు సమగ్ర కులగనకు తక్షణమే ప్రశ్నావళి ని రూపొందించి మార్గదర్శకాలు విడుదల చేయాలని అదేవిధంగా ఊరురా దండోరా వేయించి సుశిక్షితులైన ఉద్యోగులను నియమించి చాలా సూక్ష్మంగా నిశితంగా కులాలను వారి సామాజిక ఆర్థిక రాజకీయ స్థితిగతులను లెక్కించాలని ఆయన కోరారు. డిటిఎఫ్ నాయకులు కస్తూరి ప్రభాకర్ మాట్లాడుతూ కులగణన అనేది బీసీల సామాజిక ఆర్థిక అభివృద్ధికి తోడ్పడే విధంగా ఉండాలని అన్నారు. బిసి నాయకులు బంటు వెంకటేశ్వర్లు గుండెబోయిన నాగేశ్వరరావు యాదవ్ గుండు శ్రీరాములు గౌడ సంఘం నాయకులు, మున్నూరు కాపు సంఘం నాయకులు కంచి సత్యనారాయణ, జ్వాలా వేంకటేశ్వర్లు,పద్మశాలి సంఘం నాయకులు తిరందాసు వేణుగోపాల్,రజక సంఘం నాయకులు ఎర్రబెల్లి దుర్గయ్య,బొల్ల రామ నరసయ్య పద్మశాలి సంఘం నాయకులు, మున్నూరు కాపు సంఘం మిర్యాలగూడ నియోజకవర్గ అధ్యక్షులు పందిరి వేణు,యాదవ సంఘం డివిజన్ అధ్యక్షులు చిమట ఎర్రన్న, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు మహేష్ గౌడ్, మండాది శంకర్, కొత్త వెంకట్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు పోగుల సైదులు, నల్లగంతుల నాగభూషణం, వేమవరపు భీమరాజు, నరేందర్ మండలి సావిత్రి, ఊరిబండి శ్రీనివాస్ యాదవ్, కంపసాటి మధుసూదన్ యాదవ్, రేపల్లి సత్య ప్రకాష్ నాయుడు, భూపతి నరేష్ గౌడ్, దోనేటి శేఖర్ పాల్గొన్నారు

## అనుమతులు అంతంతే

**భువనగిరి –నవభూమి:** దీపావళి పండగకు చిన్న, పెద్ద అందరూ టపాసులు కాల్చి ఆనందంగా జరుపుకుంటారు. పండగకు పెద్ద ఎత్తున బాణసంచా విక్రయాలు జరుగుతుంటాయి. జిల్లాలో టపాసుల విక్రయాల కోసం శాశ్వతంతో పాటు, తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేసి విక్రయాలు చేస్తున్నారు. ఏ దుకాణమైన బాణసంచా విక్రయాలు చేసే వారు పూర్తిస్థాయి అనుమతులు తీసుకొని నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. ఏ మాత్రం నిబంధనలు పాటించకుంటే అగ్ని ప్రమాదాలు బారిన పడే అవకాశం ఉంటుంది. ఒక దుకాణం ఏర్పాటు చేసేందుకు అగ్నిమాపక, పోలీస్, రెవెన్యూ, మున్సిపాలిటీ అనుమతులు తప్పనిసరి. పెద్దమొత్తంలో హెూల్ సేలు విక్రయాలు చేసే దుకాణాలకు ఎక్స్ప్లోజివ్ శాఖ అనుమతులు పొందాలి. కొన్ని దుకాణాలు అనుమతులు పొందకుండానే ఏర్పాటు చేస్తున్నారు. టపాసుల తక్కువ ధర, నాణ్యత లేనివి తీసుకొచ్చి విక్రయాలు చేస్తున్నారు. జిల్లాలో తాత్కాలికంగా దుకాణాల కోసం 60 మంది ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేశారు. వాటిలో 50 దుకాణాలకు సంబంధిత శాఖల అధికారులు అనుమతులు ఇచ్చారు. వాటిలో జిల్లా కేంద్రమైన భువనగిరిలో పది దుకాణాలు ఉన్నాయి. నివాస సముదాయాలకు దూరంగా బహిరంగ ప్రదేశాల్లో తాత్కాలికంగా దుకాణాలను ఏర్పాటు చేసుకోవచ్చు వాటిలో 100 కిలోల టపాసుల నిల్వ మాత్రమే చేసుకొని విక్రయాలు చేయాల్సి ఉంటుంది. తాత్కాలిక ఏర్పాట్లలో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు మంటలు ఆర్పేందుకు డ్రమ్ముల్లో నీళ్లు, ఇసుక బకెట్లు సిద్ధంగా ఉంచుకోవాలి. తాత్కాలిక షెడ్డు నిర్మాణం అగ్ని ప్రమాదాలకు ఆస్కారం లేకుండా నిర్మాణం చేసుకోవాలి. జిల్లాలో తొమ్మిది శాశ్వత టపాసుల విక్రయాలు ఉన్నాయి. ఈ దుకాణాల లైసెన్స్ ప్రతి ఏడాది పొందాల్సి ఉంది. భువనగిరిలో 5, చౌటుప్పల్‌లో రెండు, ఆలేరు, మోత్కూరులో ఒక్కో దుకాణాల ద్వారా అమ్మకాలు చేస్తున్నారు. ధరలపై పర్యవేక్షణ కరవు టపాసుల అమ్మకాల ధరలపై వినియోగదారులకు పెద్దగా అవగాహన లేకపోవడంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా విక్రయాలు చేస్తున్నారు. అనుమతుల పొందిన కంపెనీలు కాకుండా ఇతర తక్కువ ధరలకు, నాణ్యత లేని వాటిని తీసుకొచ్చి అధిక ధరలకు విక్రయాలు చేస్తున్నారు. దుకాణాల ఎదుట ధరలకు సంబంధించి బోర్డులు ఉండవు. ఇష్టారాజ్యంగా ధరలకు అమ్మకాలు చేస్తుండటంతో వినియోగదారుల జేబులకు చిల్లులు పడుతున్నాయి. అధికార యంత్రాంగం ధరల నియంత్రించాలని వినియోగదారులు కోరుతున్నారు. నిబంధనల మేరకే అనుమతులు తాత్కాలిక దుకాణాల కోసం ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న వారు తనిఖీలు చేసి నిబంధనలు మేర అనమతులు ఇస్తున్నాం. అనుమతులు లేకుండా విక్రయాలు చేసే వారిని గుర్తించి చర్యలు తీసుకుంటాం. పర్మినెంటు దుకాణాలు నిబంధనల మేర సేఫ్టీ పరికరాలను ఏర్పాటు చేయాల్సిందే. నిర్వహణ లేకున్నా, అగ్నిప్రమాదాలు జరకుండా ఏర్పాట్లు చేసుకోవడంపై దుకాణాల లోపాలపై ఇతర శాఖల సమన్వయంతో చర్యలు తీసుకుంటాం.



# అండర్ 17 జిల్లా స్థాయి ఖో ఖో పోటీలకు తొండ విద్యార్థి ఎంపిక



**తిరుమలగిరి, నవభూమి, అక్టోబర్ 30, సూర్యాపేట జిల్లా:** తిరుమలగిరి మండలం తొండ గ్రామ హై స్కూల్ విద్యార్థి సంకటి అరుణ్ కుమార్ తుంగతుర్తి హై స్కూల్లో నిర్వహించినటువంటి నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ 17 ఖో ఖో పోటీలలో జిల్లా స్థాయికి ఎంపిక కావడం జరిగింది. సంకటి అరుణ్ కుమార్ తొమ్మిదవ తరగతి చదువుతున్నాడు. ఈ ఎంపిక పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు , మండల విద్యాధికారి ఐ శాంతయ్య, పి ఈ టి పొరెళ్ల వెంకన్న, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, వీరన్న,వెంకటి, సైదులు, రఘుపతి, రాజు,నాగయ్య తో పాటు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

# మనసుకు నచ్చితే..చిత్రమే..!

**చిట్యాల-నవభూమి:** వారు ప్రకృతి ప్రేమికులు.. పల్లె నేపథ్యం వారిది.. చిన్నతనంలో గుట్టలు, పుట్టలు, చెరువులు, కుంటలు, వ్యవసాయబావులు, పక్షులు, జంతువులతో అనుబంధం పెంచుకున్నవారు. వారి వయసుతో పాటు ప్రకృతిపై వారికున్న మమకారం కూడా పెరిగింది. ఇంకేముంది.. ఓవైపు తమ వృత్తిని కొనసాగిస్తూనే తమ మనసుకు నచ్చిన దృశ్యాలు కనిపించినప్పుడు , వీలు చేసుకుని తమ కెమెరాల్లో బంధిస్తూ ఆత్మసంతృప్తిని పొందుతున్నారు. ఇతరులకు నచ్చిందా? లేదా? అనేదానికన్నా తమకు సంతృప్తిని ఇచ్చిందా లేదా అనే వారు ఆలోచిస్తున్నారు. చిట్యాల పురపాలికకు చెందిన రావుల వెంకట్‌రెడ్డి 2012 నుంచి పక్షుల చిత్రాలు తీస్తూ ఇలాంటి ప్రయత్నాలు చేస్తుండగా, మండలంలోని వనిపాకలకు చెందిన వనిపాకల (వట్టె)లచ్చిరెడ్డి 1984 నుంచి ప్రకృతి దృశ్యాలను బంధిస్తున్నారు. ఛాయాగ్రాహకులైన స్నేహితుల స్ఫూర్తితో..ఛాయాగ్రాహకులైన కొందరు స్నేహితుల స్ఫూర్తితో తాను ఫొటోగ్రఫీని ఒక అభిరుచిగా ఎంచుకున్నానని వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. బోర్‌వెల్ సంబంధ వ్యాపారంలో ఆయన కొనసాగుతున్నారు. తన వృత్తిలో భాగంగా ఆయన ఆఫ్రికా ఖండంలోని జాంబియా, జింబాబ్వే, మొజాంబిక్, టాంజానియా, నైజీరియా, ఇథియోపియా వంటి పలు దేశాల్లో పర్యటించారు. ఫొటోలు ఎవరైనా సాధారణంగా చిత్రీకరిస్తుంటారు. కానీ.. క్షణాల్లో ఎగురుతూ తన గమనాన్ని మార్చుకునే పక్షులను చిత్రీకరించడం కష్టమైన పని. పలు వెబ్‌సైట్లను పరిశీలిస్తూ ప్రయోగాలుచేయడం ద్వారా పక్షుల చిత్రాలు తీయడంలో కొంత పట్టు సాధించానని వెంకట్‌రెడ్డి తెలిపారు. వివిధ దేశాల్లో రకరకాల పక్షులు కనిపించినప్పుడు వాటిని బంధిస్తుంటానని తెలిపారు. ఆన్‌లైన్‌లో వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రఫీలో 2019లో నిర్వహించిన పోటీలో తన చిత్రం మూడో స్థానం సంపాదించిందన్నారు. పక్షులతో పాటు ఇటీవలి కాలంలో ప్రకృతి దృశ్యాలు, మనుషుల చిత్రాలపై కూడా దృష్టి సారించానని తెలిపారు. జీవితంలో ఒత్తిళ్ల నుంచి తనకు ఫొటోగ్రఫీ ఊరటనిస్తుందన్నారు.భావితరాలకు జ్ఞాపకంగా అందించాలని..తన మనసుకు నచ్చిన చిత్రాలను భావితరాలకు ఒక జ్ఞాపకంగా అందించాలనే ఆలోచనతో ప్రకృతి దృశ్యాలను తీస్తున్నట్లు లచ్చిరెడ్డి పేర్కొన్నారు. ప్రస్తుతం ఆయన చిట్యాల మండలం పెద్దకాపర్తి జడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్‌అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. చిన్నప్పటి నుంచి లలితకళల పట్ల ఉన్న ఆరాధన భావన ప్రకృతిలో కనిపించే ప్రతి దృశ్యాన్ని కళాత్మకంగా చూడడం అలవాటు చేసిందంటున్నారాయన. 1984లో ఇంటర్ చదువుకునే సమయంలో నల్గొండలో ఫొటోగ్రఫీ ప్రదర్శనలకు వెళ్లడం, కవిసమ్మేళనాలకు హాజరుకావడం తనపై ప్రభావాన్ని చూపాయని పేర్కొన్నారు. ఉదయించే సూర్యుడు, రాత్రివేళ జాబిలి, జాతరలు, బతుకమ్మ నిమజ్జనాలు, ఆకాశంలో కమ్ముకునే మేఘాలు, ఆకాశాన్ని ఆకర్షణీయం చేసే రంగులు ఇలా...చూసే దృష్టికోణాన్ని బట్టి ప్రతిదీ గొప్ప కళాఖండంగానే కనిపిస్తుందని అభిప్రాయపడ్డారు. వందల చిత్రాలను బంధించినా, సుమారు 50 వరకు తన మనసుకు దగ్గరగా ఉన్నాయని తెలిపారు. వాటిలో 20చిత్రాలను ఫొటో ప్రింట్లు వేయించి ఆల్బంలో భద్రపరిచానన్నారు. సాధారణంగా జీవనగమనంలో ఎదురయ్యే ఒత్తిళ్ల నుంచి కూడా ఇలాంటి అలవాట్లు మనని దూరంగా ఉంచుతాయని పేర్కొన్నారు.



# ఓటర్లు 29,64,913 మంది

**నల్గొండ -నవభూమి:** ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఓటర్ల సంఖ్య 29,64,913 చేరింది. ఓటరు జాబితా ప్రత్యేక సవరణపై కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం మంగళవారం పోలింగ్ కేంద్రాల్లో ముసాయిదా ఓటరు జాబితాను ప్రకటించారు.సవరణలు, కొత్తగా ఓటరు నమోదుకు ప్రతి ఏడాది ఎన్నికల సంఘం ఓటరు జాబితా ప్రక్రియ చేపడుతుంది. ఈ ఏడాది జిల్లాలో ఆగస్టు 20 నుంచి ప్రక్రియ ప్రారంభించారు. ఇందులో భాగంగా చేపట్టిన ఇంటింటి సర్వే పూర్తయింది. దీంతో ముసాయిదా ఓటరు జాబితాను ప్రకటించారు.18 ఏళ్లు నిండే వారికి అవకాశం..కొత్తగా ఓటరుగా నమోదు చేసుకునేందుకు 2025 జనవరి నాటికి 18 ఏళ్లు నిండే వారికి ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. ఆన్‌లైన్‌లో, ఆఫ్‌లైన్‌లో స్థానిక తహసీల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చు దీనికి నవంబరు 28 గడువు ఉంది. ఓటరు జాబితా సవరణలో భాగంగా రెండు రోజులు(నవంబరు 9,10 తేదీల్లో) పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేకంగా నమోదు చేపడతారు. ఆయా తేదీల్లో బీఎల్‌వోలు వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటారు. కొత్తగా పేరు నమోదుకు ఫారం-6, పేరు తొలగించేందుకు ఫారం-7 పేరు, చిరునామా, పోలింగ్ కేంద్రం మార్పులకు ఫారం-8 వంటివి బీఎల్‌వోల వద్ద ఉంటాయి.అభ్యంతరాల స్వీకరణ అభ్యంతరాలు 30వ తేదీ నుంచి స్వీకరిస్తారు. తప్పులు దొర్లినా, పేరు లేకున్నా, ఇంకా ఇతరత్రా వాటికి స్థానిక తహసీల్ కార్యాలయాల్లో దరఖాస్తు ఇవ్వొచ్చు దీనికి నవంబరు 28 వరకు గడువు ఉంది. అభ్యంతరాలు డిసెంబరు 24 లోపు పరిశీలించి ఆ తర్వాత 2025 జనవరి 6న తుది ఓటరు జాబితాను ప్రకటిస్తారు. 18 సంవత్సరాలు పూర్తయినవారు నూతన ఓటర్లుగా నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు.



# ఘాట్ రోడ్డు విస్తరణ ఎప్పుడో?

**నార్కట్‌పల్లి -నవభూమి:** ప్రముఖ పుణ్యక్షేత్రం చెర్వుగట్టులోని శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి గుహాలయానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు. వార్షిక బ్రహ్మోత్సవాలు, నెలలోని ప్రతి అమావాస్యకి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఈ ఆలయానికి గుట్టపైకి వెళ్లడానికి ఒకటే ఘాట్ రోడ్డు ఉండడంతో భారీ వాహనాలు, కారుతో పాటు ఇతర వాహనాల్లో వచ్చే భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలి నడకన వచ్చే వారు సైతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. త్వరలోనే కార్తిక మాస పూజలు ప్రారంభం అవుతుండడంతో ఈ ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉంది.ఘాట్ రోడ్డు సమస్య పరిష్కారానికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే వేముల వీరేశంతో పాటు శాఖకు సంబంధించిన ఉన్నత స్థాయి అధికారులకు నివేదికను పంపినట్లు ఈవో నవీన్‌కుమార్ తెలిపారు. ప్రస్తుతం ఉన్న ఘాట్‌ను 20 అడుగుల వెడల్పు చేయడంతో పాటు నంది విగ్రహం నుంచి భక్తుల వాహనాలు గుట్టపైకి వెళ్లేలా ఏర్పాట్లు చేస్తున్నాం.ప్రధాన సమస్యలు...ప్రతి అమావాస్యకు ఇక్కడ రాత్రి బస చేసేందుకు 60 వేల మంది వరకు వస్తుంటారు. వారంతా గుట్ట పరిసర ప్రాంతాల్లో నిద్ర చేసి.. తెల్లవారుజామున వారి స్వగ్రామాలకు వెళ్తారు. ఘాట్ రోడ్డు ఇరుకుగా ఉండటంతో గుట్టకు ఇరువైపులా ఉన్న మార్గాలు యల్లారెడ్డిగూడెం, నందులు నుంచి వచ్చే వాహనాలను గుట్టకు సుమారు కిలోమీటర్ దూరంలోని ఉచిత పార్కింగ్ స్థలంలో నిలిపి కాలి నడకన మెట్ల మార్గం ద్వారా గుట్టపైకి చేరుకుంటారు. ఇదే అదునుగా ఆటోడ్రైవర్లు నడవలేని వారు, వృద్ధుల నుంచి అధిక డబ్బులు తీసుకుంటున్నారు. ముఖ్య రోజులు, సెలవులు, పండగల సమయంలో గుట్టపైకి చిన్న, పెద్ద వాహనాలు అధిక సంఖ్యలో రావడంతో ఘాట్ రోడ్డు ఇరుకుగా మారి ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. దాదాపు గంట పాటు సమయం వాహనాలను నిలిపేందుకే కేటాయిస్తున్నామని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇరుకుగా ఉంది మా ఇష్టదైవం శివుడు కావడంతో కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం, పండగ రోజుల్లో కారులో వచ్చి స్వామివారిని దర్శించుకుంటాం. ఘాట్ రోడ్డులో తమ వాహనం రావడం కోసం డబ్బులు చెల్లించి గుట్టపైకి వచ్చిన తర్వాత పార్కింగ్ స్థలం ఉండటం లేదు. దీంతో పాటు ఇతర వాహనాలు వచ్చి ఢీకొట్టడంతో అదనపు భారం పడుతుంది. గుండేబోయిన గోపి, గోపలాయపల్లి ఇబ్బంది పడుతున్నాం హైదరాబాద్ నుంచి చెర్వుగట్టు క్షేత్రానికి ద్విచక్రవాహనంపై వచ్చాం. అమావాస్య సమయంలో ఘాట్ రోడ్డులో అనుమతించడం లేదు. గుట్ట కింద పార్కింగ్ స్థలంలో వాహనం నిలిపి అక్కడ ఉన్న ఆటోలో అధిక డబ్బులు చెల్లించి గుట్టపైకి వెళ్లాల్సి వస్తోంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఘాట్ రోడ్డు సమస్యకు పరిష్కారం చూపాలి.



## ఇంటింటి సర్వే కార్యక్రమంపై అవగాహన

**భువనగిరి–నవభూమి:** మంగళవారం కలెక్టరేట్ సమావేశంలో ఇంటింటి సర్వే కార్యక్రమం ఏర్పాట్లపై అవగాహనా మాస్టర్ అందరికి అవగాహనా కల్పించారు. సంబంధిత కలెక్టర్ అధికారులకు పలు సూచనలు చేశారు.ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర సర్వే నవంబర్‌లో నిర్వహించడం జరుగుతుందని అన్నారు. మున్సిపల్ పరిధిలో అన్ని ఏర్పాట్లను పర్యవేక్షించి, అవసరమైన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్లకు ఆదేశించారు. డిజిటలైజేషన్ కోసం డేటా ఎంట్రీ ఆపరేటర్లను కూడా ఏర్పాటు చేయాలన్నారు. ఈ సర్వే అన్ని ప్రభుత్వ పథకాల అమలులో కీలక పాత్ర పోషిస్తుందని, ఎటువంటి తప్పులు లేకుండా, ఎంత త్వరగా సాధ్యమైతే అంత త్వరగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ గంగాధర్, జిల్లా ముఖ్య కార్యనిర్వాహక తదితరులు పాల్గొన్నారు.

## పాత రకం.. ధర అధికం



**భానుపురి–నవభూమి:** సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌లో పాత రకం ధాన్యం విక్రయించేందుకు అన్నదాతలు తీసుకొచ్చారు.సీజన్‌లో మార్కెట్‌లో అమ్మకుండా నిల్వ చేసుకొని ఇప్పుడు తీసుకొస్తుండటంతో మంచి ధర పలుకుతోంది. కొత్త, పాతరకాల వడ్ల రాసుల రాకతో 'పేట' మార్కెట్ కళకళలాడుతోంది.ధాన్యం రకాలు మార్కెట్‌కు పాత రకం బీపీటీ, జైశ్రీరాం, హెచ్ఎంటీ ధాన్యం వస్తోంది. మంగళవారం పాత బీపీటీ 386 బస్తాలు(251 క్వింటాళ్లు) రాగా ఖరీదుదారులు క్వింటాకు గరిష్ఠ ధర రూ.3074 నిర్ణయించారు. జైశ్రీరాం 540 బస్తాలు(351 క్వింటాళ్లు) రాగా గరిష్ఠ ధర రూ.3113 పలికింది. హెచ్ఎంటీ 37 బస్తాలు(24 క్వింటాళ్లు) తీసుకొస్తే గరిష్ఠ ధర రూ.2536కు కొనుగోలు చేశారు.ఎక్కువగా జైశ్రీరాం రాక మార్కెట్‌కు వచ్చిన పాత రకాలలో ఎక్కువగా జైశ్రీరాం ఉంటోంది. రైతులు సీజన్‌లో వీటిని విక్రయించకుండా నిల్వ చేసుకున్నారు. ఈ వడ్లను మర ఆడించి ఇంటిల్లిపాది తినడానికి ఎక్కువగా వినియోగిస్తున్నారు. డిమాండ్ ఉండటంతో ధర కూడా ఎక్కువగా ఉంటోంది. వచ్చిన పాత రకాలలో జైశ్రీరాం రకానికి గరిష్ఠ ధర పలికింది. 25 మంది రైతులు పాతరకం ధాన్యం తీసుకొచ్చారు. 'రైతులు నాణ్యమైన ధాన్యం తీసుకొచ్చి మద్దతు ధర పొందాల'ని మార్కెట్ కార్యదర్శి సంతోష్ కుమార్ కోరారు.

## ఆరు లేన్లకు గ్రీన్‌సిగ్నల్

**చౌటుప్పల్–నవభూమి:** జాతీయ రహదారి నెం.65 విస్తరణకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. నాలుగులేన్ల నుంచి ఆరులేన్ల విస్తరణకు కేంద్రం అనుమతినిచ్చింది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం నుంచి ఎన్టీఆర్ జిల్లా చిల్లకల్లు వరకు 65వ జాతీయ రహదారిని విస్తరించారు. దాదా పు రూ.1800కోట్లతో జాతీయ రహదారిని నాలుగులేన్లతో నిర్మించారు. ఆ సమయంలోనే ఆరులేన్ల రహదారికోసం భూసేకరణ చేశారు. ప్రస్తుతం రోడ్లు, రవాణా శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పలుమార్లు కేంద్ర ఉపరితల, రవాణశాఖ మంత్రి నితిన్ గడ్కరీతో సమావేశమై ఆరులేన్ల రహదారిగా విస్తరించాలని విజ్ఞప్తిచేశారు. ఎట్టకేలకు ఆరులేన్ల రహదారిగా మార్చడానికి కేంద్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 65వ నెంబర్ జాతీయ రహదారిపై 17బ్లాక్ స్పాట్‌లను గుర్తించారు. అక్కడ ప్రమాదాల నివారణకు ఫ్లైఓవర్ల నిర్మాణం, సైన్‌బోర్డుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. చౌటుప్పల్, పెద్దకాపర్తి, చిట్యాల, కట్టంగూరు, ఇనుపాముల, టేకుమట్ల, సూర్యాపేట జిల్లాకేంద్రంలోని ఈనాడు జంక్షన్, జనగాం ఎక్స్‌రోడ్డు, పిల్లలమర్రి ఎక్స్‌రోడ్డు, దురాజ్‌పల్లి, ముకుందాపురం, ఆకుపాముల, కొమరంబండ, కట్టకొమ్ముగూడెం, మేళ్ళచెర్వు ఎక్స్‌రోడ్డు, మునగాల ఎక్కువ ప్రమాదాలు జరిగే ప్రాంతాలుగా గుర్తించారు. ఇలాంటి చోట్ల ఫ్లైఓవర్లు నిర్మించడం, సైన్‌బోర్డులు ఏర్పాటు చేయడంతో ప్రమాదాల నివారణకు చర్యలు చేపడుతారు.

## విద్యార్థుల పెండింగ్ ఉపకార

# వేతనాలను విడుదల చేయాలి






**భువనగిరి–నవభూమి:** తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజు రియింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చింతల శివ లావుడియా రాజు అన్నారు.బుధవారం పట్టణ కేంద్రంలోని ప్రిన్స్ కార్నర్ చౌరస్తా వద్ద ఎస్ఎఫ్ఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఫీజు దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో రూ.8,000 కోట్ల పెండింగ్ ఉపకార వేతనాలు ఉన్నాయన్నారు. గత ప్రభుత్వంలో విద్యారంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, ప్రస్తుతం అదే పద్ధతిని కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తుందని విమర్శించారు. విద్యార్థులు రోడ్లపైకి వచ్చి పోరాటాలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించకుండా మౌనం ఎందుకు వహిస్తుందో అర్థం కావడం లేదన్నారు. రాష్ట్రంలో విద్యార్థుల అకౌంట్లోకి టోకెన్ అమౌంట్‌గా విడుదల చేసిన రూ.1200 కోట్లను వెంటనే ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు ఈర్ల రాహుల్, సతీష్, చింటూ, జీవన్, రజిని మమత మాధవి సౌందర్య పాల్గొన్నారు.ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ బీబీనగర్ మండలంలో బ్రహ్మణపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆలస్యం లేకుండా ధాన్యం కొనుగోలు ఎప్పటికప్పుడు జరపాలన్నారు. ఏ కేంద్రంలోనూ ఎలాంటి సమస్య రాకూడదని అధికారులకు సూచించారు. ఇప్పటి వరకు వచ్చిన ధాన్యం వివరాలు, కొనుగోలు, చెల్లింపులకు సంబంధించిన వివరాలను, రిజిస్టర్లను, ఆన్‌లైన్ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఆయన వెంట భువనగిరి ఆర్డీవో కృష్ణారెడ్డి, సంబంధిత అధికారులు ఉన్నారు.

## అభివృద్ధి మతాబులు..

# సంక్షేమ చిచ్చుబుడ్లు

**మిర్యాలగూడ–నవభూమి:** తెలుగింటి లోగిళ్లు దీపావళి వెలుగులు పంచేందుకు సిద్ధమయ్యాయి. ఏటా జరిపినట్లే ఈసారీ దీపావళి వేడుకలు అంబరాన్నంటనున్నాయి.కాకపోతే.. కొందరి సంతోషం.. చిచ్చుబుడ్డి వెలుగులను తలపించనుండగా.. మరికొందరి ఆనందం.. లక్ష్మీ బాంబు పేలుడిలా ఉట్టిపడనుంది. ఇంకొందరి ఆహ్లాదం.. కాకరపూలు, వెన్నెల మడుగు వెలుతురిలో ముందడుగుపడ్డట్లు అన్పిస్తోంది. మొత్తంగా ఈ దీపావళికి.. ప్రకృతి మాత్రం రైతన్న ఆశల్ని సగమే వెలిగించింది.సగం పేలిన వ్యవసాయ చిచ్చుబుడ్డి..ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది వ్యవసాయ చిచ్చుబుడ్డి సగం వరకే పేలింది. సీజన్ తొలి నాళ్లలో తీవ్ర వర్షాభావ పరిస్థితులతో సాగు సమయానికి మొదలు కాలేదు. కొంత ఆలస్యంగా సాగునీరు పుష్కలంగా అందుబాటులోకి రావడంతో నాగార్జునసాగర్‌తో పాటు జలాశయాలన్నీ నీటితో నిండిపోయాయి. దీంతో సంతోషంగా సాగు మొదలు పెట్టారు.మరోవైపు ప్రభుత్వం చేపట్టిన రూ.2లక్షల వరకు రైతు రుణమాఫీ 60 శాతం మాత్రమే పూర్తి కావడంతో 40 శాతం రైతులు ఎదురుచూపులతో కాలం వెళ్లదీస్తున్నారు. ఇక సన్న ధాన్యానికి రూ.2,320 మద్దతు ధరతో పాటు ఐకేపీ కేంద్రాల్లో విక్రయిస్తే రూ.500 బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కాగా అనేక మంది రైతులు సన్న ధాన్యాన్ని నేరుగా మిల్లుల్లో విక్రయిస్తుండడంతో ఈ అవకాశాన్ని కోల్పోతున్నారు. ? అకాల వర్షాలతో పలు చోట్ల పంట నష్టం జరిగి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో 13.5లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేయగా, సగం దెబ్బతింది. ఈ దీపావళి కొందరు రైతుల జీవితాల్లో చీకట్లు నింపగా.. పలువురిలో వెలుగులు నింపిందని చెప్పుకోవాలి.ప్రగతి ఆటం బాంబులు..ఉమ్మడి జిల్లాలో ఇద్దరు మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో పాటు సీనియర్ నాయకులు ఉండడంతో అభివృద్ధి ఆటంబాంబులు పేలాయి. నల్గొండకు వందల కోట్లతో బైపాస్ రహదారి నిర్మాణం మంజూరు, మిర్యాలగూడలో రూ.120 కోట్లతో నాలుగు పైవంతెనల నిర్మాణం, హుజూర్‌నగర్‌లో ఐటీఐ కళాశాల మంజూరు, యాదాద్రి థర్మల్ విద్యుదుత్పత్తి కేంద్రంలో ట్రయల్ రన్, ఇదే కేంద్రంలో బొగ్గు రవాణాకు ఉద్దేశించిన రైలు ట్రయల్ రన్ వంటి అభివృద్ధి ఆటంబాంబుల్లా పేలాయి.మరోవైపు శంషాబాద్ నుంచి సూర్యాపేట మీదుగా విశాఖపట్నానికి హైస్పీడ్ రైల్వే కారిడార్ ప్రాథమిక సర్వే చివరి దశకు చేరుకోగా.. సూర్యాపేట మీదుగా డోర్నకల్–గద్వాల రైల్వే లైన్ డీపీఆర్ సిద్ధమవుతోంది. ఇవి కార్యరూపం దాలిస్తే ఏళ్ల తరబడి రైళ్ల కోసం ఎదురు చూస్తున్న సూర్యాపేట జిల్లా వాసుల కల నెరవేరనుంది.ఉద్యోగ కాకరపువ్వుల మిలమిలలు..ఈ ఏడాది నిరుద్యోగుల జీవితాల్లో ప్రభుత్వం వెలుగు నింపింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది వివిధ శాఖల్లో వంద మందికి పైగా ఏఈఈ ఉద్యోగాలు సాధించగా.. 500 మందికి పైగా ఉపాధ్యాయ కొలువులు సాధించి ఇటీవలే విధుల్లో చేరారు. జీవితంలో స్థిరత్వానికి దారిచూపినట్టు వారి చేతుల్లో కాకర పువ్వుల్లా వారి ముఖాలు తళతళమన్నాయి. మరోవైపు ఎన్నో ఏళ్లుగా ఊరిస్తున్న గ్రూప్–1 పరీక్షలు ఇటీవలే పూర్తి కాగా.. గ్రూప్–2, గ్రూప్–3 పరీక్షలు సైతం ఈ ఏడాదిలో పూర్తి కానున్నాయి. ఎన్నాళ్లుగానో పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు, ఎంఈవోల నియామకం సైతం ఇటీవలే పూర్తయింది.పేలిన సంక్షేమ 'లక్ష్మీ' బాంబులు..ఈ ఏడాది ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మహాలక్ష్మి, గృహలక్ష్మి వంటి పథకాలను లక్ష్మీ బాంబుల్లా పేలాయి. మహాలక్ష్మి పథకంలో భాగంగా లక్షలాది మంది మహిళలు ఉమ్మడి జిల్లాలోని ఆర్టీసీ పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించారు. గృహలక్ష్మి పథకంలో భాగంగా వేలాది మంది మహిళలకు రూ.500కే వంట గ్యాస్ అందిస్తుండగా.. 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్తు సైతం అనేక మంది ఇళ్లలో వెలుగులు నింపింది. కొత్త రేషన్ కార్డులు, ఆసరా పింఛన్ల పంపిణీ, ఇందిరమ్మ ఇళ్లు, రెండు పడక గదుల ఇళ్ల పంపిణీలో ఆలస్యంతో ప్రజలు కొంత అసహనంతో ఉన్నారు.



# యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లో దొంగతనానికి పాల్పడిన
# ఐదుగురి అరెస్టు

◆ రూ 15.35లక్షలు, సెల్ ఫోన్లు స్వాధీనం ◆ డీఎస్పీ రాజశేఖర్ రాజు





**మిర్యాలగూడ నవభూమి, అక్టోబర్ 30:–** గత రెండు సంవత్సరాలుగా మిర్యాలగూడ డివిజన్ దామరచర్ల మండలం వీర్లపాలెం గ్రామంలో నిర్మాణంలోని యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ లో కాంట్రాక్ట్ కంపనీ బిహెచ్ఇఎల్ (భేల్) లో దొంగతనానికి పాల్పడిన ఐదుగురిని అరెస్టు చేసినట్టు మిర్యాలగూడ డిఎస్పీ రాజశేఖర్ రాజు తెలిపారు. బుధవారం స్థానిక పోలీస్ సబ్ డివిజన్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ కేసులో పరారీలో ఉన్న ఉత్తర ప్రదేశ్ కు చెందిన రంజిత్ కుమార్ వర్మ, అభయ్ ప్రతాప్ మౌర్యలను స్పెషల్ టీమ్స్ ఏర్పాటు చేసి పట్టుకుని విచారించగా వైటీపిఎస్ కు సంబందించిన మరికొన్ని దొంగతనాలు వెలుగులోకి రావడం జరిగిందని తెలిపారు. ఇదే క్రమంలో యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ నిర్మాణ సంస్థ అయిన బిహెచ్ఇఎల్ (భేల్) కు చెందిన సబ్ – కాంట్రాక్ట్ కంపనీ అయిన దుర్గా క్రేన్ సర్వీసెస్ మరి కొన్ని అల్యూమినియం రోల్స్ కూడా దొంగతనానికి గురైనట్లు గుర్తించి దరఖాస్తు ఇచ్చారన్నారు. ఇట్టి విషయంలో విచారణ జరపగ గతంలో దొంగతనానికి పాల్పడిన షేక్ మునీర్, కంబాల అశోక్, షేక్ మహమూద్, షేక్ యాకూబ్ పాషాలతో పాటుగా ఇర్కిగూడెం గ్రామానికి చెందిన గోపిశెట్టి అజయ్, పసుపులేటి కోటేశ్వర్ రావు, పుల్లయ్య అను వ్యక్తులను కేసులో నిందితులుగా గుర్తించి అరెస్టు చేశామన్నారు. సదరు వ్యక్తులు భేల్(బిహెచ్ఈఎల్) యార్డు పరిసర ప్రాంతాలలో అన్ లోడ్ చేసిన స్టోర్ యార్డులో అల్యూమినియం వస్తువులను దొంగింలించి వాటిని హైడ్ర ల ద్వారా అద్దెకు తెచ్చిన వాహనాలలో లోడ్ చేసుకొని బయట సుమారు ఒక అల్యూమినియం రోల్ విలువ రూ. 6.5 లక్షలు ఉండగా దానిని వీరు దొంగిలించి బయట ఒక లక్ష రూపాయల చొప్పున పాత ఇనుము వ్యాపారులైన షేక్ శర్ఫుద్దీన్, ఖైరుద్దేన్, ముజీబ్, వహీద్ అలీలకు అమ్మి సొమ్ము చేసుకున్నారన్నారు. నల్గొండ ఎస్పి శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు మిర్యాలగూడ డిఎస్పి కె.రాజశేఖర్ రాజు పర్యవేక్షణలో మిర్యాలగూడ రూరల్ సిఐ కె.వీరబాబు సిసిఎస్ సిఐ జితేందర్ రెడ్డి, సిసిఎస్ ఎఎస్ఐ అఫ్జల్ అలీ, హెడ్ కానిస్టేబుల్ విష్ణువర్ధన్ గిరి, పుష్ప గిరి, ఇమ్రాన్, వహీద్, లింగారెడ్డి సిబ్బంది దొంగతనాలకు పాల్పడుతున్న నేరస్తులను పట్టుకొని అద్భుత ప్రతిభతో పోలీసులపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని మరింత పెంచామన్నారు. ఇక మీదట వైటీపిఎస్ లో ఇలాంటి దొంగతనాలకు పాల్పడితే పోలీసులకు పట్టుబడుతామనే భయాన్ని నేరస్తులకు కలిగించడం జరిగినదన్నారు. మిర్యాలగూడకు చెందిన షేక్ మునీర్,ఇర్కిగుడకు చెందిన కంబాల అశోక్, మిర్యాలగూడకు చెందిన షేక్ మహమ్మద్,ఇర్కిగూడెంకు చెందిన గోపిశెట్టి అజయ్, పసుపులేటి కోటేశ్వర్ రావు , ఉత్తర్ ప్రదేశ్ కు చెందిన సూపర్ వైజర్లు రంజిత్ కుమార్ వర్మ,అభయ్ ప్రతాప్ మౌర్య బెంగాల్ కు చెందిన సూపర్ వైజర్ కమలేశ్,పుల్లయ్య, సెక్యూరిటి గార్డ్ హైదరాబాద్ కు చెందిన పాత ఇనుము వ్యాపారులు మహమ్మద్ శర్ఫుద్దీన్, మహమ్మద్ ఖైరుద్దీన్, షేక్ ముజీబ్, మహమ్మద్ వహీద్ ఆలీ, షేక్ రజాక్,నర్సయ్య నిందితులున్నారన్నారు. ఐదుగురు నేరస్తులు రాత్రి సమయంలో వైటీపిఎస్ యార్డ్ లోనికి అక్రమంగా ప్రవేశించి అప్పటికే తమకు పరిచయమున్న బిహెచ్ఇఎల్ కంపేనికి చెందిన స్టోర్ యార్డ్ వద్ద సెక్యూరిటిగా పనిచేసే సిబ్బందితో తమకు పరిచయమున్న హైడ్ర సూపర్ వైజర్ ల సహాయంతో దొంగిలించిన మెటీరియల్ ను మిర్యాలగూడలోని అడ్డ మీద ఉండే కిరాయి వాహనాలలో మాట్లాడుకొని, దొంగిలించిన అల్యూమియమ్ సామాగ్రిని తమ వాహనాలలో లోడ్ చేసుకొని హైదరాబాదు లోని ముషీరాబాద్ కు చెందిన షర్ఫోద్దీన్, ఖైరుద్దీన్, షేక్ ముజీబ్, వహీద్ అలీ లకు విక్రయించి సొమ్ము చేసుకుని పంచుకున్నారన్నారు. ఇదే క్రమంలో సదరు వ్యక్తులు సుమారు రెండు సంవత్సరాలుగా దొంగతనాలకు పాల్పడుతుండగా గుర్తించి పట్టుకున్నామన్నారు. నేర పరిశోధనలో భాగంగా బుధవారం మధ్యాహ్నం సమయంలో పోలీసులకు సదరు వ్యక్తుల గురించి నమ్మదగిన సమాచారం రాగా తమ సిబ్బందితో కలసి పట్టుకొన్నారన్నారు. కేసులో ప్రస్తుతం అయిదుగురు నిందితులను అరెస్టు చేశారు. అదేవిదంగా మరొక 10 మంది నేరస్తులను అరెస్టు చేసి, మరి కొంత విలువ సొమ్మునస్వాధీనం చేయవలసి ఉన్నదన్నారు. దొంగతనాలకు పాల్పడిన వ్యక్తులను గుర్తించి ప్రజలకు పోలీసులపై మరింత నమ్మకం కలిగేలా చేసిన మిర్యాలగూడ రూరల్ సిఐ కె. వీరబాబు, సిసిఎస్ సిఐ జితేందర్ రెడ్డి, సిసిఎస్ ఎఎస్ఐ అఫ్జల్ అలీ, హెడ్ కానిస్టేబుల్ విష్ణువర్ధన్ గిరి, పుష్ప, గిరి, ఇమ్రాన్, వహీద్, లింగారెడ్డి వారి సిబ్బందిని అబినందించారు. నిందితుల నుండి రూ. 15,35,000లు, 3 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిందితులను స్థానిక జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచగా జ్యుడీషియల్ కస్టడీకి తరలించారని తెలిపారు.

## జిల్లా ప్రగతే లక్ష్యం: నూతన కలెక్టర్ హనుమంతరావు



**భువనగిరి, –నవభూమి:** ఆర్డీవో గా.. రెండు జిల్లాల్లో కలెక్టర్‌గా.. వివిధ శాఖలలో పని చేసిన అనుభవంతో జిల్లా సర్వతో ముఖాభివృద్ధికి పాటుపడతా.. ప్రభుత్వ పథకాలే ప్రాధాన్యాం శాలుగా చేపడతా.. అన్ని వర్గాల సహకారంతో జిల్లాను ఆదర్శంగానూ.. రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తానని కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎం.హనుమంతరావు వెల్లడించారు. మంగళవారం సాయంత్రం ఆయన తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు.శ్రీలక్ష్మీనారసింహ స్వామి కొలువుదీరిన జిల్లాకు కలెక్టర్‌గా పని చేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ముఖ్యమంత్రి, ప్రభుత్వం తనపై ఎంతో నమ్మకంతో ఈ జిల్లాకు కేటాయించారని, ఆ నమ్మకాన్ని వమ్ము చేయకుండా జిల్లాను ప్రగతి పథంలో నడిపించేందుకు కృషి చేస్తానని వెల్లడించారు.ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను విజయవంతం చేయడమే తన కర్తవ్యమని ఒక ప్రశ్నకు బదులిచ్చారు.ఉమ్మడి జిల్లాకు చెందిన వ్యక్తిగా, సిద్దిపేట కలెక్టర్‌గా పని చేసిన అనుభవంతో ఈ జిల్లాపై పూర్తిగా అవగాహన ఉందన్నారు. గతంలో సిద్ధిపేట, సంగారెడ్డి కలెక్టర్‌గా, పంచాయతీ రాజ్ శాఖ కమిషనర్‌గా, సమాచార, పౌర సంబంధాల శాఖ డైరెక్టర్‌గా పని చేసిన తనకు ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనులపై అవగాహన ఉందన్నారు. కావాల్సిన సమాచారాన్ని ప్రజలు తమ వద్ద సిద్ధంగా ఉంచుకునే విధంగా విస్తృత ప్రచారం చేస్తానన్నారు. రైతులు ధాన్యాన్ని శుభ్రం చేసుకుని, నాణ్యతా ప్రమాణాల మేరకు శుభ్రం చేసుకుని తీసుకొస్తే వెంటనే కొనుగోళ్లు సాధ్యం అవుతుందన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు మూసీ పునర్జీవం పోసే కార్యక్రమాలు చేపడతామని, జిల్లాలోని ఐదు మండలాలు మూసీ కాలుష్య సమస్యను ఎదుర్కొంటున్నాయన్నారు.ప్రస్థానం ఇలా..యాదాద్రి భువనగిరి కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎం.హనుమంతరావు ఉమ్మడి జిల్లా వాసి. 2016లో నూతనంగా ఆవిర్భవించిన యాదాద్రి భువనగిరి జిల్లాకు ఐదో కలెక్టర్. ఉమ్మడి నల్గొండ జిల్లా చిలుకూరు మండలం బేతవోలు వాసి. విద్యాభ్యాసం ఇక్కడే సాగింది. తొలుత కాకినాడలో పాలిటెక్నిక్ కళాశాలలో అధ్యాపకుడిగా పని చేశారు. 2007లో ఆర్డీవోగా ఎంపికయ్యారు. సిద్ధిపేట, మహబూబ్‌నగర్, జగిత్యాల ఆర్డీవోగా పని చేశారు. 2013లో ఐఏఎస్ అయ్యారు. సంగారెడ్డి, సిద్దిపేట కలెక్టర్‌గా పని చేశారు. ఆ తదుపరి పంచాయతీరాజ్ శాఖ కమిషనర్‌గా, ప్రస్తుతం సమాచార శాఖ డైరెక్టర్‌గా, దేవాదాయ శాఖ డైరెక్టర్‌గా పూర్తి స్థాయి అదనపు బాధ్యతలు నిర్వహిస్తూ తిరిగి కలెక్టర్ హోదాలో యాదాద్రి భువనగిరి జిల్లాకు నియమితులయ్యారు.

## యాదాద్రిలో కార్తీక వేడుకలకు ఏర్పాట్లు



**యాదగిరిగుట్ట: –నవభూమి:** యాదాద్రి పుణ్యక్షేత్రం లో వచ్చే నెల 2 నుంచి మొదలయ్యే కార్తీక మాసం ఆధ్యాత్మిక వేడుకల నిర్వహణ కోసం అవసరమైన చర్యలు చేపట్టామని శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయ ఈవో భాస్కరరావు తెలిపారు.నవంబర్ 2వతేది ప్రారంభమై డిసెంబర్ 1 వరకు కొనసాగే కార్తీక మాసంలో భక్తులు మొక్కులు తీర్చుకునే శ్రీసత్య నారాయణస్వామి వ్రతాలను సామూహికంగా ప్రతి రోజు 6 దఫాలుగా, కార్తీక పౌర్ణమి రోజు 8 దఫాలుగా నిర్వహిస్తారు.వ్రత మండపంలోని రెండు హాళ్లలో వ్రతాలను నిర్వహిస్తారు. ఈ నెల 31వ తేదీన దీపావళి పండుగ సందర్భంగా యాదగిరిగుట్ట దేవాలయం లో పూజా వేళలు మార్చినట్లు ఆలయ ఈవో. ఉదయం 3.30 కి స్వామి వారి సుప్రభాతం. 8.15 నిమిషాలకు సర్వ దర్శనం ప్రారంభం.

## 'చెర'వాణి

**న్ాంపల్లి–నవభూమి:** చేతిలో చరవాణి లేకుంటే ఒక్క నిమిషం కూడా గడపలేని పరిస్థితి. ప్రపంచాన్ని కళ్లముందు ఉంచుతున్న సెల్‌ఫోన్‌తో ఎన్ని ఉపయోగాలు ఉన్నాయో ఒక్కోసారి అన్నే ఇబ్బందులున్నాయి.ఏ పనిలో ఉన్నా చరవాణిని వీడలేనంత వ్యసనంగా మారిపోతేనే సమస్య ఉత్పన్నమయ్యేది. ఆహారం తినేటప్పుడు, నిద్ర పోయేటప్పుడు కళ్లన్నీ అటే అప్పగిస్తున్నారు. చివరకు కుటుంబంతో సమయం గడపలేని, పిల్లలతో ఆప్యాయంగా మాట్లాడలేని స్థితిలో ఉంటున్నారని నిపుణులు చెబుతున్నారు. పనులు పక్కననెట్టి, వృత్తిని వదిలిపెట్టి చాటింగ్, ఎప్పటికప్పుడు వాట్సప్ సందేశాలు పరిశీలించుకోవడం, పదేపదే క్రికెట్ స్కోరు చూసుకోవడంలో గడిపేస్తున్నారు. జీవన సోపానానికి అక్కరకొచ్చే అమూల్యమైన సమయాన్ని అంతర్జాలంలో వృథా చేస్తున్నారు.తినేటప్పుడూ వదలడం లేదు..చరవాణి చూస్తూ ఏం తింటున్నామో.. ఎంత తింటున్నామో తెలియడం లేదు. ఫలితంగా అధిక బరువు, దీర్ఘకాలిక వ్యాధులకు ఆస్కారం ఉంది. ఇంట్లో భోంచేసేటప్పుడు వంట బాగుందని గానీ.. నీవు భోజనం చేశావా? వంటి విషయాలను అడగాలని జీవిత భాగస్వామి కోరుకుంటుంది. భర్త తినే సమయంలో భార్య కొసరి.. కొసరి వడ్డించే సమయం కొన ఊపిరి వరకూ గుర్తుండిపోతుంది. కానీ, చరవాణి పుణ్యమా అని పలకరింపులు మాని భార్యాభర్తలిద్దరూ స్మార్ట్‌ఫోన్‌కే అతుక్కుపోతున్నారు.తీరిక లేకుండా..పట్టణాల్లో మధ్య, దిగువ తరగతి జనాభానే ఎక్కువగా ఉంటుంది. ఉద్యోగ, వ్యాపారాలు, ఇతరత్రా వృత్తుల్లో ఉండే వారికి సైతం నెలకు రెండు మూడు దఫాలు కుటుంబంతో గడిపే సమయం దొరుకుతుంది. పిల్లలు బయటికెళ్దామని మారాం చేస్తుంటారు. జీవిత భాగస్వామి ఏదైనా హోటల్‌కు వెళ్దామని కోరుకుంటారు. స్నేహితులు కలుసుకోవడం సరేసరి. ఇలా ఆత్మీయులతో సమయం గడిపే అవకాశం వస్తుంది. వారితో కలిసి మధ్యాహ్నం.. లేదా రాత్రి వేళల్లో భోజనం చేసేటప్పుడు సైతం నీ.. నా.. తేడా లేకుండా అందరూ అంతర్జాలంలో మునిగితేలుతున్నారు. ఆర్డర్ చేసిన ఆహార పదార్థాలు వచ్చే వరకూ వారితో మనసు విప్పి మాట్లాడటం లేదు.